ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 15 మార్చి 2025



నూకాంబిక ఆలయ ఈఓగా రాంబాబు


రాంబాబు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలోని నూకాంబిక అమ్మవారి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి (ఈఓ)గా వెంపలి రాంబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇతను ప్రస్తుతం సింహాచలం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. అనకాపల్లి ఆలయానికి ఏసీ హోదాలో ఈఓగా ప్రభుత్వం నియమించింది. అనకాపల్లి ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎన్.సుజాత నుంచి ఆయన శనివారం బాధ్యతలు స్వీకరిస్తారు.


వడ్డాది ఆలయంలో పూజలు అందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఉపమాక, వడ్డాదిల్లో స్వామివారికి చక్రస్నానాలు

నక్కపల్లి మండలం ఉపమాక, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వెంకన్న వార్షిక కల్యాణోత్సవం ముగిసిన తరువాత వచ్చే పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందని భక్తుల నమ్మకం. ఉపమాక క్షేత్రంలో ఉభయ దేవేరులతో వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదర్శన పెరుమాళ్ రూపంలో వున్న కల్యాణ వేంకటేశ్వరుడికి సాయంత్రం రాజయ్యపేట సముద్ర తీరంలో చక్రస్నానం చేయించారు. కాగా వడ్డాదిలో స్వామివారిని వీధుల్లో ఊరేగించి నాగవల్లి ఉత్సవం (వసంతోత్సవం) నిర్వహించారు. భక్తులు పరస్పరం వసంతం చల్లుకున్నారు. అనంతరం స్వామివారికి పెద్దేరు నదిలో చక్రస్నానం చేయించారు.

-నక్కపల్లి, బుచ్చెయ్యపేట/ ఆంధ్రజ్యోతి


ఉపమాకలో స్వామివారి దర్శనానికి క్యూ లైన్లలో నిల్చున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) ఉభయ దేవేరులతో ఉపమాక వెంకన్న

నేడు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర

- జగన్నాథపురంలో కార్యక్రమానికి హాజరు కానున్న రాష్ట్ర స్థాయి అధికారులు పీఎస్ గిరీషా, బి.రాజశేఖర్

అనకాపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం జిల్లా అంతటా శనివారం జరగనున్నది. అచ్యుతాపురం మండలం జగన్నాథపురంలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి అధికారి పీఎస్ గిరీషా, వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఫార్మా కంపెనీలో మొక్కలు నాటుతారని, పరవాడ మండలం తానాంలో గురుకుల పాఠశాలను సందర్శిస్తారని కలెక్టర్ వెల్లడించారు.

సంపద సృష్టిద్దాం!

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఆదేశాలు
- గత టీడీపీ హయాంలో జిల్లాలో 500కుపైగా పంచాయతీల్లో షెడ్ల నిర్మాణం
- ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్లు
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రాలపై శీతకన్ను
- వేతనాలు ఇవ్వకపోవడంతో విధులు మానేసిన గ్రీన్ అంబాసిడర్లు
- నిరుపయోగంగా మారిన సంపద కేంద్రాలు
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పునరుద్ధరణకు చర్యలు
- ఇప్పటికే 250 పంచాయతీల్లో వినియోగంలోకి కేంద్రాలు
- మిగిలినచోట్ల కూడా త్వరలో అందుబాటులోకి తేవడానికి చర్యలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాలో ఐదు వందలకుపైగా సంపద తయారీ కేంద్రాలు వుండగా, వీటిలో సగం మాత్రమే ప్రస్తుతం వినియోగంలో వున్నాయి. మిగిలిన కేంద్రాలను కూడా వినియోగంలోకి తీసుకువచ్చి, పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మరికొద్ది నెలల్లో అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పనిచేసేలా చర్యలు చేపడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు స్వచ్ఛ భారత్ పథకం అమల్లో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రభుత్వం దృష్టిసారించింది. వీధులు, ఇళ్లల్లో సేకరించే చెత్తను శాస్త్రీయ విధానంలో వేరుచేయడానికి ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతి పంచాయతీలో 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం' నిర్మించాలని భావించింది. పంచాయతీ జనాభానుబట్టి ఒక్కో కేంద్రానికి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అధికారులు నిధులు కేటాయించారు. ప్రస్తుత అనకాపల్లి జిల్లా పరిధిలో 642 గ్రామ పంచాయతీలు వున్నాయి. టీడీపీ అధికారంలో వున్నప్పుడు 515 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మించారు. వివిధ కారణాల వల్ల మిగిలిన పంచాయతీల్లో సంపద కేంద్రాలు అందుబాటులోకి రాలేదు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రతి 1,000 మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల వేతనంగా నిర్ధారించారు. గ్రీన్ అంబాసిడర్లు రోజూ తమ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద కేంద్రానికి తరలించాలి. తడి చెత్త, పశువులపేడతో వర్మీ కంపోస్టు ఉత్పత్తి చేయాలి. స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా ఏడాదిపాటు వీరికి వేతనాలు ఇచ్చారు. తరువాత ఏడాది నుంచి సంపద కేంద్రాల్లో ఉత్పత్తి అయ్యే వర్మీ కంపోస్టు, పొడి చెత్త విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. ఇది జరిగిన ఏడాది తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసింది. అత్యధిక పంచాయతీల్లో సంపద కేంద్రాల నుంచి తగిన ఆదాయం రాకపోవడం ... మిగతా 8వ పేజీలో


రోలుగుంట మండలం ఎన్.కొత్తూరులో వినియోగంలో లేని సంపద తయారీ కేంద్రం

వృథాగా గోదాము

రావికమతంలో రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన పౌరసరఫరాల శాఖ



నిరుపయోగంగా పడివున్న పౌరసరఫరాల గోదాము. (ఇన్‌సెట్‌లో) గోదాము ప్లాట్ ఫారంపై ఖాళీ మద్యం సీసాలు

- రహదారి సదుపాయం లేకపోవడంతో ప్రారంభించని అధికారులు
- మందుబాబులకు అడ్డాగా మారిన గోదాము

రావికమతం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): **మండల కేంద్రంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పౌరసరఫరాల గోదాము నిరుపయోగంగా పడివుంది. రాత్రిపూట మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రధాన రహదారి నుంచి గోదాము వరకు రోడ్డు సదుపాయం లేకపోవడంతో వినియోగించుకోలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు.**

రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో పేదలకు పంపిణీ చేసే బియ్యం, పంచదార, కందిపప్పు, ఇతర నిత్యావసర సరకులను నిల్వ చేయడానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సుమారు 40 ఏళ్ల క్రితం గోదాము (ఎంఎల్ఎస్ పాయింట్) నిర్మించారు. ప్రతి నెలా ఇక్కడి నుంచే రెండు మండలాల రేషన్ డిపోలకు ఆయా సరకులు సరఫరా అవుతుంటాయి. అయితే కాలక్రమేణా గోదాము పైకప్పు దెబ్బతినడంతో వర్షం వస్తే నీరు కారిపోయి సరకులు తడిసిపోతున్నాయి. పైగా ఏటేటా రేషన్ కార్డుదారులు పెరుగుతుండడంతో సరకులు నిల్వ చేయడానికి గోదాము చాలడంలేదు. దీంతో కొత్తగా మరింత పెద్ద గోదాము నిర్మించాలని 2018లో పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. రావికమతం-మేడివాడ మధ్యలో అగ్నిమాపక కేంద్రం వెనుక రెండు వేల టన్నుల నిల్వ సామర్థ్యంతో గోదాము నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. విజయవాడకు చెందిన ఒక కాంట్రాక్టర్ గోదాము నిర్మాణ పనుల టెండర్‌ను దక్కించుకున్నారు. పనులు మొదలయ్యేసరికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పలుమార్లు పనులు ఆపేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు 2023లో గోదాము నిర్మాణం పూర్తయ్యింది. అయితే గోదాం వద్ద లారీలు మళ్లేందుకు తగ్గిన ఖాళీ స్థలం లేదు. ఇంకా బీఎన్ రోడ్డు నుంచి గోదాము వరకు సుమారు 400 మీటర్ల మేర రోడ్డు సదుపాయం లేదు. దీంతో గోదాము వినియోగంలోకి రాలేదు. అధికారులు సైతం పట్టించుకోలేదు. శివారున ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. పగటి పూట కూడా ఇక్కడ మద్యం సేవిస్తున్నారు.

కాగా గోదాము నిరుపయోగంగా పడి వుండడంపై పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జయంతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. గోదాము చుట్టూ లారీలు తిరగడానికి రోడ్డు లేదని, ఇక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు, పనిచేసే కలాసీలకు తాగునీరు, మరుగుదొడ్లు లేవని, అంటేకాక బీఎన్ రోడ్డు నుంచి గోదాం వరకు లారీల రాకపోకలకు రోడ్డు సదుపాయం లేదన్నారు. ఈ పనులకు అవసరమైన నిధుల కోసం ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని చెప్పారు. నిధులు మంజూరైతే పనులు పూర్తిచేయించి గోదామును వినియోగంలోకి తెస్తామని ఆమె తెలిపారు.

సముద్రంలో బోటు బోల్తా

- మత్స్యకారుడి గల్లంతు

రాంబిల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకయ్యపాలెం వద్ద సముద్రంలో చేపలవేట సాగిస్తున్న బోటు అలల తాకిడికి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఒక మత్స్యకారుడు గల్లం తయ్యాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మేరుగు జగన్ (20), మరో ఐదుగురుతో కలిసి శుక్రవారం ఉదయం రాంబిల్లి మండలం వెంకయ్యపాలెం వద్ద సముద్రంలో చేపల వేట సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆకస్మికంగా పెద్ద అల రావడంతో బోటు బోల్తాపడింది. ఇందులో జగన్ నీటిలో పడి మునిగిపోగా, మిగిలిన క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ సంఘటనపై జగన్ తండ్రి అచ్చియ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్టు సీఐ నరసింగరావు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.11
సహరి (ఆది)	4.50

నూకాంబిక అమ్మవారికి రెండు నెలల్లో కొత్త ఆలయం

శరవేగంగా పునర్నిర్మాణ పనులు

- ప్రధాన ఆలయం, ప్రాకార మండపం, అనివెట్టి మండపం, రాజగోపురాలు పూర్తి
- ఆలయం లోపల ఫ్లోరింగ్ పనులు
- రంగులతో త్వరలో ముస్తాబు


తుది మెరుగులు దిద్దుకుంటున్న నూకాంబిక అమ్మవారి నూతన ఆలయం

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): **స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో పనులన్నీ పూర్తవుతాయని దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.**

నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తుల రాక నానాటికీ పెరిగిపోతున్నది. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం కావడంతో భక్తుల రద్దీ అధికంగా వున్నప్పుడు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు ఆలయాన్ని విస్తరించి, పునర్నిర్మించాలని ప్రజా ప్రతినిధులు భావించారు. ఇదిఇ కార్యరూపం దాల్చే సమయానికి ప్రభుత్వం మారింది. అనంతరం వైసీపీ పాలకులు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారు. ఎట్టకేలకు ఆలయ పునర్నిర్మాణానికి 2023 జూన్ ఎనిమిదో తేదీన శంకుస్థాపన చేశారు. రూ.10 కోట్లతో పునర్నిర్మాణ పనులు అక్టోబరు 27న ప్రారంభమయ్యాయి. అయితే అనుకున్నంత వేగంగా పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు వేగవంతం అయ్యాయి. గతంలో ఆలయం పొడవు 98 అడుగులు వెడల్పు 60 అడుగులు ఉండేది. పునర్నిర్మాణంలో భాగంగా ఆలయం పొడవు 175 అడుగులు, వెడల్పు 94 అడుగులకు పెంచారు. గర్భాలయం పొడవు, వెడల్పు గతంలో 14 అడుగుల చొప్పున వుండేవి. కొత్తగా 18 అడుగులకు పెంచారు. అంతరాలయం పొడవు 12, వెడల్పు 14 అడుగులు వుండగా, పునర్నిర్మాణంతో పొడవు 18 అడుగులు, వెడల్పు 15 అడుగులకు పెరిగింది. అనివెట్టి మండపం గతంలో పొడవు 27 అడుగులు, వెడల్పు తొమ్మిది అడుగులు వుండగా, ఇప్పుడు పొడవు 55 అడుగులు, వెడల్పు 45 అడుగులతో నిర్మిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశలో వున్నాయి. ప్రస్తుతం ఆలయం లోపల ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. గతంలో టీడీపీ హయాంలో తూర్పు భాగంలో రాజగోపురం నిర్మించారు. తరువాత మిగిలిన మూడు దిక్కుల్లో రాజగోపురాలు నిర్మిస్తున్నారు. రాతికట్టు దేవాలయ నిర్మాణానికి రూ.3,05 కోట్లు, ప్రాకార మండపానికి రూ.3.9 కోట్లు, అనివెట్టి మండపానికి రూ.1.3 కోట్లు, మూడు రాజగోపురాలకు రూ.1.73 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 28వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కొత్త అమావాస్య జాతరకు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలని భావించినప్పటికీ సాధ్యం కాలేదు. రెండు నెలల్లో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇటీవల ఆలయానికి వచ్చి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


విశాఖలో రంగులు చల్లుకుంటున్న మహిళలు

ఉత్సాహంగా హోలీ సంబరాలు

జిల్లావ్యాప్తంగా శుక్రవారం రంగుల పండుగ హోలీని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ...ఉత్సాహంగా గడిపారు. యువతీ యువకులు ఆనందోత్సాహాలతో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పిల్లలు బెలూన్స్ ఎగురవేస్తూ, వాటర్ గన్స్‌తో రంగు నీళ్లు చల్లుకుంటూ ఆనందించారు. అనకాపల్లిలో మార్వాడీలు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. యువకులు కర్రలు పట్టుకొని కోలాటం మాదిరిగా డ్యాన్సులు వేశారు.



మునగపాకలో రంగులు జల్లుకుంటున్న పిల్లలు

ఆనందోత్సాహాలతో హోలీ

- ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ శుభాకాంక్షలు
- పిన్నలు, పెద్దల కోలాహలంతో గ్రామ గ్రామానా సందడి



గవర్ల అనకాపల్లిలో...

ఎలమంచిలి/మునగపాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : హోలీ వేడుకలను నియోజకవర్గంలోని ప్రజలు శుక్రవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎలమంచిలి పట్టణంలో ఈ పండుగ మిన్నంటింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ.. శుభాకాంక్షలు తెలుసుకున్నారు. యువకుల ఆనందానికి అవధులు లేవు. రాజస్థాన్‌కు చెందిన యువతతో పాటు మార్వాడీలు హోలీని ఆనందంగా గడుపుకున్నారు. ఇదిలావుంటే మునగపాక మండలం వ్యాప్తంగా హోలీ వేడుకలు ఆహ్లాదంగా జరిగాయి. చిన్నాపెద్దా అన్న తేడలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఏటికొప్పాక.. సమస్యల కుప్ప



ఏటికొప్పాక బజారు వీధిలో లీకవుతున్న తాగునీటి కుళాయి పైప్‌లైన్

- కాలువల్లో పేరుకుపోయిన మురుగు
- పైప్‌లైన్ల లీకేజీతో తాగునీరు వృథా
- కుక్కలు, పందుల స్వైర విహారంతో మరిన్ని అవస్థలు

ఎలమంచిలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాకను సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ప్రధానంగా గ్రామంలోని పలు చోట్ల తాగునీటి కుళాయిలకు సంబంధించిన పైపులైన్లు లీకవుతున్నాయి. ఫలితంగా తాగునీరు వృథాగా పోతోంది. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి సమస్య తలెత్తకముందే అధికారులు అప్రమత్తం కావాలని అంతా కోరుతున్నారు. అదే విధంగా పలు వీధుల్లో పందులు, కుక్కల సంచారం తీవ్రంగా ఉం దని అంటున్నారు. వీధి కుక్కలు ద్విచక్ర వాహనాలపై వెళుతున్నవారిని వెంబడిస్తుండడంతో తరచూ చిన్నచిన్న ప్రమాదాలు జరగుతున్నాయని వాపోతున్నారు. అలాగే, గ్రామంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేవారు కరువయ్యారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఓ వైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో నివాసితులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా దళిత కాలనీ వీధుల్లోని డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు పారని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలన్నింటిపైనా అధికారులు వెంటనే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



దళిత కాలనీలో డ్రైనేజీ దుస్థితి

మత్స్యకారులకు వేట నిషేధ సాయం అందించాలి

సీపీఎం మండల కారదర్శి దేముడునాయుడు

రాంబిల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వేట నిషేధ సాయాన్ని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సీపీఎం మండల కారదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సీపీఎం నాయకులు శుక్రవారం కొత్తపట్నం గ్రామంలో పర్యటించి మత్స్యకారులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు వేట నిషేదసాయం రూ.20వేలు అందిస్తామని చెప్పారని, అయినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ ప్రాంతంలో ఎన్ఏఓబీ ఏర్పాటు వలన ఉపాధి పూర్తిగా దెబ్బతిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్ఏఓబీలో నిర్మాణ పనులు జరుగుతున్నా నిర్వాసితులైన స్థానికులకు ఉపాధి పనులు కల్పించడం లేదని ఆరోపించారు. నిర్వాసితులైన మత్స్యకారులకు ఇవ్వాల్సిన ప్యాకేజీ కూడా పూర్తిగా ఇవ్వకుండా ప్రభుత్వాలు ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దోని కాశియ్య, నాగుమంత్రి శ్రీనివాసరావు, చోడిపిల్లి అప్పలరాజు, యు.అప్పారావు, సిహెచ్.ధనరాజు తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడనర్సాపురంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

రాంబిల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) వాడనర్సాపురంలో జనసేన నాయకుడు కారే నాని సొంత నిధులతో నిర్మించిన పార్టీ జండా దిమ్మను శుక్రవారం ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర ప్రారంభించారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేశారు. అనంతరం నూకన్న దొర మాట్లాడుతూ మత్స్యకార గ్రామాల్లో జనసేన పార్టీని మరింతగా బలోపేతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చోడిపిల్లి ప్రసాద్, నేతలు చింతకాయల కోదండరావు, రామునాయుడు, అప్పలరాజు, దేముడు, కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామిని దర్శించుకుంటున్న ఆనంద్ ఎమ్మెల్సీ వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు తదితరులు

ఎలమంచిలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం సీతారామ చంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠను వైభవోపేతంగా నిర్వహించారు. విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు జ్ఞాపకార్థం డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ దంపతులతో పాటు మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి దంపతులు స్వామివారికి విశేష పూజలు జరిపిన అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, నాయకులు పీవీఎన్ మాధవ్, మేడపాటి రవీంద్ర, పరశురామరాజు, పరమేశ్వరరావు, ఎస్ఆర్‌కే శివాజీ రాజా బహదూర్, బడే రవి కిరణ్‌లతో పాటు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులంతా వేర్వేరుగా దేవతామూర్తులను దర్శించుకున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు. స్థానిక నాయకులతో పాటు ఆనంద్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మునగపాక : ఇక్కడి దళితవాడలో నిర్మించిన రామాలయంలో ప్రతిష్ఠించనున్న సీతారామలక్ష్మణ విగ్రహాలను శుక్రవారం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక రథంలో విగ్రహాలను ఉంచి ఉంచారు. హరిదాసుల కీర్తనలు, సింహాద్రి అప్పన్న సేవగరిడీలు ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

'పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించండి'



కార్మికులతో ప్రజ్ఞ చేయిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎలమంచిలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ములకలాపల్లిలో గల మై హోమ్ సిమెంటు పరిశ్రమ ఆవరణలో శుక్రవారం జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ సీనియర్ జీఎం (ఆపరేషన్స్) బి.రామస్వామి, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బీకే సుధాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై భద్రతపై పలు సూచనలు చేశారు. పరిశ్రమల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్షణ పరికరాలను వినియోగిస్తే ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ జీఎం. బి.రామస్వామి, సీనియర్ డీజీఎం (పీఅండ్ఏ) ఎల్.శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్ కె.సతీష్, కార్మికులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

గుమ్మిడిగొండ మలుపు వద్ద ఘటన

నాతవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్మిడిగొండ పంచా యతీ శివారు చిక్కుడుపాలెంలో శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పెదపాత్రుని సత్తిబాబు (60) శుక్రవారం సాయంత్రం అల్లిపూడి నుంచి ట్రాక్టర్‌తో వరిగడ్డిని చిక్కుడుపాలెంతీసుకువచ్చాడు. అక్కడ గడ్డిని అన్‌లోడ్ చేసి తిరిగి అల్లిపూడి వెళుతుండగా గుమ్మిడిగొండ మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమా దంలో ట్రాక్టర్ ఇంజన్ కింద పడిడ్రైవర్ సత్తిబాబు మృతి చెం దాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమి త్తం నర్సీపట్నం ఏరియా ఆసు పత్రికి తరలించినట్టు ఎస్ఐ సీహెచ్. భీమరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎల్‌టీ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం



ఎల్‌టీ.కాలనీ జీరో లైనులో కాలువను పరిశీలిస్తున్న పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌టీ కాలనీలో డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు తెలిపారు. ఎల్‌టీ.కాలనీలోని జీరో లైనులో అధ్వానంగా ఉన్న కాలువతో పాటు పలు వీధుల్లోని కాలువలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు మూడు వేల కుటుంబాలు నివాసం ఉంటున్న ఎల్‌టీ.కాలనీలో కాలువలు ఉన్నప్పటికీ మురికినీరు బయటకు పోయేందుకు సరైన అవుట్‌లెట్లు లేవని, దీంతో ఎక్కడికక్కడ మురికినీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలనీలో సుమారు రూ.60 లక్షలతో ప్రధాన కాలువ, అవుట్‌లెట్ల ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి వదిలివేయడంతో సమస్య పరిష్కారంకాక కాలనీ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఈ సమస్యను హోం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లగా కాలనీలో కాలువల నిర్మాణం, అవుట్‌లెట్ల ఏర్పాటుకు నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని చెప్పారు. దీంతో సమస్య త్వరలోనే పరిష్కారం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంది కాశీవిశ్వనాథం, దేవాది మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

నక్కపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బండారువీధిలో కొత్తగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. వేదపండితులు హోమాలు, పూజలు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు పార్టీల నాయకులు ఆలయాన్ని దర్శించుకున్నారు.



ఆలయంలో సీతారామలక్ష్మణ విగ్రహాలు

వలస కూలీ ఇంట్లో చోరీ

కోటవురట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్యాసిరాజుపాలెంలో ఒక వలస కూలీ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దీనికి సంబంధించి ఎస్ఐ రమేశ్ అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపాలెం శివారు సన్యాసిరాజుపాలెం గ్రామానికి చెందిన సింగంపల్లి కొండబాబు, భార్య వరలక్ష్మితో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం గత నెల 26వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాకు వలస వెళ్లారు. ఇంటో ఎవరూ లేకపోవడంతో ఇంటికి తాళం వేశాడు. అక్కడ పనులు ముగించుకొని ఈ నెల 13వ తేదీన తిరిగి సన్యాసిరాజుపాలెం వచ్చారు. ఇంటి తలుపులకు వేసిన తాళంతో పాటు గడియకూడా లేదు. ఇంటిలోకి వెళ్లి బీరువాలో పరి శీలించగా రూ.20 వేలు నగదు, అర తులం బంగారం చెవి దుద్దులు కనిపించలేదు. చోరీ జరిగినట్టు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేశ్ క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- భక్తులతో నిండిపోయిన క్యూ లైన్లు





ఆలయం బయట చాంతాడంత క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు... తీరంలో ఉత్సవమూర్తికి చక్రస్నానం అనంతరం బయటకు తీసుకువస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఫాల్గుణమాసం ఏకాదశి తరువాత వచ్చే పౌర్ణమిని ఉపమాక పున్నమి(పౌర్ణమి)గా భక్తులు పిలుస్తుంటారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అనేక ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఉపమాక ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో వున్న క్యూ లైన్లనీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయం బయట కూడా భక్తులు క్యూ కట్టారు. కొండపై వున్న స్వామి నిజరూపాన్ని, కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

తీరంలో వెంకన్న విహారం

కల్యాణ వేంకటేశ్వరుడి విహార యాత్రతో రాజయ్యపేట తీరం పులకించింది. ఉపమాక క్షేత్రంలో వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతీ ఏటా పౌర్ణమి రోజున ఇక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో వున్న రాజయ్యపేట తీరంలో చక్రస్నానం చేయడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను, సుదర్శనపెరుమాళ్ ఉత్సవమూర్తిని అలంకరించి రాజయ్యపేట తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి సముద్ర తీరానికి సుదర్శన పెరుమాళ్ ఉత్సవమూర్తికి చక్రస్నానం చేసేటప్పుడు భక్తులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రాత్రి 10 గంటలకు ఆలయంలో డోలా ఉత్సవాన్ని నిర్వహించారు.

భక్తుల పుణ్యస్నానాలు

రాజయ్యపేట సముద్ర తీరం భక్తుల పుణ్యస్నానాలతో కిక్కిరిసిపోయింది. ప్రతి ఏటా ఉపమాక పౌర్ణమి రోజున రాజయ్యపేట తీరంలో స్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అనేక ప్రాంతాలకు చెందిన వారు రాజయ్యపేట తీరానికి వెళ్లి సముద్రస్నానాలాచరించారు.

వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ సోము

ఉపమాక ఆలయాన్ని బీజేపీ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సోము వీర్రాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, కూటమి నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు వివరించారు. ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు.

భక్తులకు హోం మంత్రి అన్నదానం

కల్యాణ వేంకటేశ్వరుడిని దర్శించుకోవడానికి వచ్చిన వేలాది మంది భక్తులకు శుక్రవారం హోం మంత్రి అనిత అన్నదానం ఏర్పాటు చేశారు. మెరకవీధి రామాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ముందుగా బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు హోం మంత్రి అనిత ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

75 కిలోల పులిహోరా పంపిణీ

నక్కపల్లికి చెందిన నున్న సుబ్రహ్మణ్యం సోదరులు, శింగంశెట్టి బాబాజీ, గోపిశెట్టి సతీశ్ శుక్రవారం రాత్రి ఉపమాక క్షేత్రంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ 75 కిలోల పులిహోరా ప్రసాదాన్ని అందజేయడంతో భక్తులంతా సంతోషం వెలిబుచ్చారు. గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది, నాయకులు వారిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ ఎస్.రాయవరం ఎంహెచ్‌క్యూ, ఎస్.రాయవరం రూరల్ ఫీడర్స్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.రాయవరం, వాకపాడు, సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో ఉన్న ఆక్వా ప్రదేశాలతో బసవపాడు, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, సైతారుపేట, సర్వసిద్ధి, వేమగిరి, పేటసూదిపురం, వాకపాడు, జేవీ.పాలెం గ్రామాల్లో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఆయన చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులంతా గమనించి తమ సిబ్బందికి సహకరించాలి ఈఈ కోరారు.

విద్యుత్ శాఖ ప్రసాదాల పంపిణీ

నక్కపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలం విద్యుత్ శాఖ సిబ్బంది శుక్రవారం ఉపమాక వెంకన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఏఈ కృష్ణ ఆధ్వర్యంలో ఉపమాక ఆలయ ఆవరణలో విద్యుత్ శాఖ సిబ్బంది భక్తుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉపమాక, వేంపాడు సబ్‌స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది వెంకన్న భక్తులకు తమ సొంత నిధులతో ప్రసాదాలు తయారు చేసి అందజేశారు. వారి సేవలను భక్తులు ప్రశంసించారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

ఎస్.రాయవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని రామయ్యపట్నం గ్రామంలో ఉపాధి కూలీలను శుక్రవారం సత్యనారాయణ కలిసి కూలి చెల్లింపు, పని జరిగే ప్రదేశాల్లో ఏర్పాట్లతో పాటు పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కూలి డబ్బులు చెల్లించకపోవడంపై సత్యనారాయణ ఆధ్వర్యంలో ఖాళీ భోజనం ప్లేట్లను పట్టుకొని 'మేము గడ్డి తిని బతకాలా.. మాకు తిండైనా పెట్టండి. లేక కూలి డబ్బులు అయినా ఇవ్వండి' అంటూ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు రావాల్సిన ఉపాధి కూలీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు ఆరు వారాలకు చెందిన కూలి చెల్లించలేదని వాపోయారు. ఎండలు మంటుతున్నా పని జరిగే ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించలేదన్నారు.కూలీలకు రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న ఉపాధి పథకం కూలీలు

వృద్ధుడి మృతి కేసులో వార్డు సభ్యురాలి భర్త అరెస్టు

చోడవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వృద్ధుడి మృతి కేసులో పంచాయతీ వార్డు సభ్యురాలి భర్తను అరెస్టు చేసినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. టైలరింగ్ సామగ్రి విక్రయించే చిరు వ్యాపారి ఇందల సన్యాసిరావు (65) మృతి చెందిన కేసుకు సంబంధించి నిందితుడు నేమాల హరిని శుక్రవారం అరెస్టు చేశామన్నారు. ఈ కేసు వివరాలను విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. పూర్ణా థియేటర్ సమీపంలో ఇందల సన్యాసిరావు దుకాణానికి వెనుక ఉన్న కొంత ఖాళీ స్థలంలోకి దుకాణాన్ని విస్తరించే ప్రయత్నంలో సన్యాసిరావు, అతని కుమారులకు, వార్డు సభ్యురాలి భర్త హరికి ఈ నెల 3న మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. అదే రోజు రాత్రి మరోసారి సన్యాసిరావు ఇంటికి హరి వెళ్లి అతని తలపై బలంగా కొట్టడంతో కుప్పకూలిపోయాడు. ఈదాడిలో సన్యాసిరావు తలకు బలంగా గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందాడు. హరిపై హత్య కేసు నమోదు చేశామని, శుక్రవారం ఐటీఐ కాలనీ వద్ద పట్టుకుని అరెస్టు చేశామని, అతన్ని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. ఎస్ఐలు జోగారావు, నాగేంద్ర పాల్గొన్నారని వివరించారు.


నర్సీపట్నంలో రంగులు పూసుకుని కేరింతలు కొడుతున్న చిన్నారులు

ఉత్సాహంగా హోలీ వేడుకలు

నర్సీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని నింజాస్ అకాడమీలో బాక్సింగ్ శిక్షణ పొందుతున్న చిన్నారులు వేడకను నిర్వహించారు. శుక్రవారం ఉదయం చిన్నారులు రంగులు పూసుకొని ఒకరికొక్కరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణ రావు చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ అబ్బు, వాకర్స్ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబి మాస్టారు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, చీడిగుమ్మల తదితర గ్రామాల్లో శుక్రవారం హోలీని ఘనంగా జరుపుకున్నారు. యువత ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంగులు జల్లుకుని నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. దీంతో గ్రామాలు హోలీ సందడితో హోరెత్తాయి.

దేవరాపల్లి: మండలంలో హోలీ సందర్భంగా యువకులు సందడి చేశారు. శుక్రవారం ఉదయం నుంచి విద్యార్థులు, యువకులు స్నేహితులతో కలసి రంగులు జల్లుకుంటూ ఆనందంగా గడిపారు.

వృద్ధుడి మృతి కేసులో ఒకరి అరెస్టు

▸▸ నిందితుడు వార్డు సభ్యురాలి భర్త: సీఐ అప్పలరాజు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పలరాజు, పక్కన ఎస్ఐలు

చోడవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వృద్ధుడి మృతి కేసులో పంచాయతీ వార్డు సభ్యురాలి భర్తను అరెస్టు చేసినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. టైలరింగ్ సామగ్రి విక్రయించే చిరు వ్యాపారి ఇందల సన్యాసిరావు (65) మృతి చెందిన కేసుకు సంబంధించి నిందితుడు నేమాల హరిని శుక్రవారం అరెస్టు చేశామన్నారు. ఈ కేసు వివరాలను విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. పూర్ణా థియేటర్ సమీపంలో ఇందల సన్యాసిరావు దుకాణానికి వెనుక ఉన్న కొంత ఖాళీ స్థలంలోకి దుకాణాన్ని విస్తరించే ప్రయత్నంలో సన్యాసిరావు, అతని కుమారులకు, వార్డు సభ్యురాలి భర్త హరికి ఈ నెల 3న మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. అదే రోజు రాత్రి మరోసారి సన్యాసిరావు ఇంటికి హరి వెళ్లి అతని తలపై బలంగా కొట్టడంతో కుప్పకూలిపోయాడు. ఈదాడిలో సన్యాసిరావు తలకు బలంగా గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందాడు. హరిపై హత్య కేసు నమోదు చేశామని, శుక్రవారం ఐటీఐ కాలనీ వద్ద పట్టుకుని అరెస్టు చేశామని, అతన్ని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. ఎస్ఐలు జోగారావు, నాగేంద్ర పాల్గొన్నారని వివరించారు.

ఉపాధి కూలి బకాయిలు తక్షణమే చెల్లించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు

నర్సీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రావణాపల్లి ఆవలో పనిచేస్తున్న గబ్బాడ, రావణాపల్లి గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలతో మాట్లాడారు. వేసవి ప్రారంభమైనా పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు సౌకర్యం కల్పించలేదని విమర్శించారు. వారం మధ్యలో ఏదైనా అవసరం పడి పనిలోకి రాకపోతే ఆ పని దినాలు కల్పించడం లేదన్నారు. అరు వారాలుగా కూలీలకు చెల్లింపులు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

మోదకొండమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో మోదకొండమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

కె.కోటపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడంపేట గ్రామంలోని మోదకొండమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం జరిగింది. వేద పండితులు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో పురోహితులు, గ్రామ పెద్దలు, మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

టమాటాకు గిట్టుబాటు ధరతో రైతుల ఆనందం

గొలుగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టమాటా ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, ఏటిగైరంపేట గ్రామాల్లో టమాటా సాగు చేపట్టారు. వారం రోజుల క్రితం 25 కిలోల ట్రే ధర రూ.100 పలికేది. ఈ వారం నర్సీపట్నం, విశాఖపట్నం, తుని, రాజమండ్రి గ్రామాలకు చెందిన వ్యాపారులు కల్లాల వద్దకు వచ్చి 25 కిలోల టమాటా ట్రేను రూ.200కు కొనుగోలు చేశారు. దీంతో పెట్టుబడి వస్తుందని రైతులు ఆనందపడ్డారు.

ఈశ్రమ్ కార్డుదారులకు ప్రమాద బీమా

చీడికాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఈశ్రమ్ కార్డులు తీసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని కార్మిక శాఖ సహాయ అధికారి పి.సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని ఎల్ఎన్.పురం పవర్‌లూమ్‌లో పనిచేస్తున్న 30 మంది కార్మికులకు శుక్రవారం మధ్యాహ్నం ఈశ్రమ కార్డులను స్వాతిమేథ్స్ అధ్యక్షురాలు పాత్రిని రాముడమ్మ, మాజీ ఎంపీపీ పోతల రమణమ్మలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కార్మికులందరూ ఈశ్రమ్ కార్డులు తీసుకోవాలని సూచించారు. కార్డుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతిమేథ్స్ మేనేజర్ దేముడమ్మ, వైస్ చైర్‌పర్సన్ దారపు లక్ష్మి, సభ్యుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

చీడికాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మంచాల మోడల్ కళాశాల, హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు నారాయణమూర్తి, కె.మంగమ్మ, ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందిని బదిలీచేయాలని, మంచినీటి ట్యాంకు పాడైనందున కొత్త ట్యాంకు మంజూరు చేయించాలని, కిటికీలు, డోర్లు బాగుచేయాలని కోరారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

▸▸ పకడ్బందీగా అమలుకు ప్రత్యేక చర్యలు

▸▸ హోల్‌సేల్ వ్యాపారులకు కమిషనర్ హెచ్చరికలు

▸▸ నేడు ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ సంచులు, వస్తువుల ప్రదర్శన


ప్లాస్టిక్ హోల్‌సేల్ దుకాణంపై దాడులు నిర్వహిస్తున్న కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి కమిషనర్ సురేంద్ర చర్యలు షురూ చేశారు. స్వచ్ఛాంధ్రా-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం కోసం పక్బందీగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, సంచులు విక్రయించే దుకాణాలపై కమిషనర్ సురేంద్ర దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. మునిసిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ హోల్ సేల్ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం వెంటనే ఆపాలని హెచ్చరిస్తున్నారు. అలాగే ఈ నెల మూడో శనివారం ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి భారీ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి 16 రకాల సింగిల్ యూజ్ ప్లాసిక్ వస్తువులు ప్రదర్శిస్తారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులు, వస్త్ర సంచులు ప్రదర్శించడంతో పాటు విక్రయించనున్నారు. ప్రత్యేకంగా పట్టణంలోని హోల్‌సేల్ వ్యాపారులతో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులతో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు ప్లాస్టిక్ నిషేధం కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను, విద్యార్థులను ఆహ్వానించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నారు. ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటీగా చేయడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ సురేంద్ర తెలిపారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణకు సహకరించాలి

▸▸ 21న ఫ్యాక్టరీ సమస్యలపై మహా ధర్నా

▸▸ చెరకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు

చోడవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణకు అందరూ సహకరించాలని ఏపీ చెరకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవనంలో శుక్రవారం షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితిపై రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీ.నాయుడు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలో రైతులు, కార్మికుల బకాయిల చెల్లింపులతో పాటు ఫ్యాక్టరీ నిర్వహణకు తక్షణ సాయంగా రూ.35 కోట్లు చెల్లించాలని, ఫ్యాక్టరీ ఆధునీకరణకు రూ.350 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా షుగర్ ఫ్యాక్టరీ ఎప్పుడు క్రషింగ్ ఆడుతుందో, ఎప్పుడు ఆగిపోతుందో తెలియని దుస్థితి దాపురించిందని వాపోయారు. ఈ పరిస్థితులు కొనసాగితే ఫ్యాక్టరీ మూతపడడం ఖాయమని, రెండు నియోజకవర్గాల రైతులు, కార్మికులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం ఈ నెల 21న చేపడుతున్న మహా ధర్నా పార్టీలకు అతీతంగా అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం నేత మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, సీఐటీయూ జిల్లా నేత వీవీ.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు గండి నాయని బాబు, ఆర్.దేముడునాయుడు, మూర్తి, దేవుళ్లు, తాతారావు, నరసింగరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, అప్పలనాయుడు, సత్యం, కోన మోహనరావు, బీటీ దొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవాడ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ కన్వీనర్‌గా ఆర్.దేముడునాయుడు, కోకన్వీనర్‌గా ఎస్‌వీ.నాయుడును నియమించారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

పిఠాపురం సభకు తరలిన జన సైనికులు



పాతకృష్ణాదేవిపేటలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు... నాతవరం: పిఠాపురం సభకు వెళ్తున్న జన సైనికులు

గొలుగొండ/కృష్ణాదేవిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట గ్రామంలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగర వేశారు. కేక్ కట్ చేసి అందరికీ శుభాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ గొలుగొండ మండల ఉపాధ్యక్షుడు లంక సత్యనారాయణ, సీనియర్ నేత డి.సహదేముడు మాట్లాడుతూ ప్రభుత్వంలో జనసేన భాగస్వాములుగా ఉన్నందున రెట్టింపు ఉత్సాహంతో ఆవిర్భావ కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పిఠాపురం సభకు వెళ్లారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మండల నాయకులు చిన్ని, అనిశెట్టి గోపి, శ్రీను, శివ, శివాజీ, గణేశ్, ప్రసాద్, యర్రా ప్రసాద్, లక్ష్మణ్, గండెం దొరబాబు, నాయకుడు రేగుబళ్ల శివ పాల్గొన్నారు.

నాతవరం: మండలంలోని తాండవ సెంటర్ నుంచి వంద వాహనాలతో జనసేన నాయకులు, కార్యకర్తలు పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు తరలివెళ్లారు. నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర జెండా ఊపి వాహనాలు ప్రారంభించారు. జై పవన్ కల్యాణ్, జైజై జనసేన అని నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పూడి చక్రవర్తి, వెలగల వెంకటరమణ, సేనపతి శేషు, రేగుపల్ల శివప్రగడ కృష్ణబాబు, సాలాదుల కృష్ణబాబు, కోన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖండివరం హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

చీడికాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖండివరం ఉన్నత పాఠశాల హెచ్ఎం చిరంజీవి ఆచారికి షోకాజ్ నోటీసు జారీ చేశామని డిప్యూటీ డీఈవో అప్పారావు తెలిపారు. 'ఖండివరం హైస్కూల్ హెచ్ఎం విధులకు డుమ్మా' అనే శీర్షికన ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు షోకాజ్ నోటీసు పంపించానని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి డిప్యూటీ డీఈవో తెలిపారు.

మూడు బోర్ల నిర్మాణానికి శంకుస్థాపన

బుచ్చెయ్యపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టియ్యపాలెం గ్రామంలో మూడు తాగునీటి బోర్ల నిర్మానానికి జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. జడ్పీ అభివృద్ధి నిధులు నుంచి మూడు తాగునీటి బోర్లు మంజూరయ్యాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వేసవి తాగునీటి అవసరానికి బోర్లు మంజూరు చేసిన జడ్పీటీసీ రాంబాబుకు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

వీరభద్రపేట రోడ్డుకు భూమి పూజ

దేవరాపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటలో రహదారి నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ రోడ్డు కోసం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి రూ.85 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ దొమ్మంగి బోడమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ భూమి పూజ చేశారు. వీరభద్రపేటకు రోడ్డు వేయాలని ఐదేళ్లుగా సీపీఎం ఆధ్వర్యంలో ఎన్నో మార్లు వినూత్నంగా నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

రావికమతం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో భక్తాంజనేయస్వామి ఆలయ 31వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారికి తమలపాకులు, సింధూరంతో అభిషేకాలు చేశారు. శని, ఆదివారాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, 16న రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని వారు చెప్పారు. భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఆర్టీసీ షెడ్యూల్స్ తగ్గించడం సరికాదు

నర్సీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, నర్సీపట్నం డిపోలలో ఆర్టీసీ షెడ్యూల్స్ తగ్గించడం సరికాదని ఎస్ఎంయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్.రాజు అన్నారు. శుక్రవారం నర్సీపట్నంలో డిపో గ్యారేజ్ గేట్ ముందు ధర్నా నిర్వహించారు. కార్మికులు ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా షెడ్యూల్స్ తగ్గించే విధానాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్, జిల్లా ప్రజా రవాణా అధికారి మొండి వైఖరి విడనాడాలని కోరారు. సంఘ ప్రతినిధులు శంకర్రావు, నారాయణరావు, పీకే రావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

నాతవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెంలో శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పెదపాత్రుని సత్తిబాబు (60) శుక్రవారం సాయంత్రం అల్లిపూడి నుంచి ట్రాక్టర్‌తో వరిగడ్డిని చిక్కుడుపాలెం తీసుకువచ్చాడు అక్కడ గడ్డిని అన్‌లోడ్ చేసి తిరిగి అల్లిపూడి వెళుతుండగా గుమ్మిడిగొండ మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ కింద పడి డ్రైవర్ సత్తిబాబు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భీమరాజు తెలిపారు.

వైభవంగా వడ్డాది వెంకన్న వసంతోత్సవం


భక్తులతో కిటకిటలాడుతున్న వెంకన్న ఆలయం

బుచ్చెయ్యపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వడ్డాది వెంకన్న కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజాంబగిరి నుంచి గ్రామం అంతా స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. దారిపొడవునా ఒకరికి ఒకరు వసంత రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. తిరువీధి ఉత్సవం పూర్తయిన తరువాత పెద్దేరు నదిలో అర్చకులు అంగర శ్రీకాంత్ ఆచార్యులు పూజలు నిర్వహించి ధర్మకర్త దొండా శ్రీరామ్‌తో చక్రస్నానం చేయించారు. అన్నదాన సత్రంలో ఎక్కువ మంది భక్తులకు అన్నదానం చేశారు. కాగా ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు భక్తులకు భారీ భద్రత కల్పించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 1 గంట వరకు ట్రాఫిక్ సమస్య లేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టారు.

విజయరామరాజుపేటలో లేగదూడల ప్రదర్శన

బుచ్చెయ్యపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేట గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. 42 లేగదూడలను రైతులు తీసుకువచ్చారు. ప్రదర్శనలో మొదటి మూడు స్థానాలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రాపేటి సత్యనారాయణ, ద్వితీయ రాపేటి సన్యాసినాయుడు, తృతీయ బహుమతి శిలపరశెట్టి మహలక్ష్మినాయుడు దూడలకు బహుమతులు వచ్చాయి. ఈ పోటీకి తీసుకువచ్చిన రైతులతో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవిచంద్ మాట్లాడుతూ, పెయ్యి పుట్టిన పది రోజులకు నట్టల నివారణ మందు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు సౌజన్య, కె.వాసవి, నాయకులు దొడ్డి కిశోర్, బాలకృష్ణ, రాజారావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ఎంఈవో

రావికమతం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో బ్రహ్మాజీ సూచించారు. మండలంలోని గర్నికం పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ చదువుకుంటే ఏదైనా సాధించగలమన్నారు. ఉన్నత చదువులోనూ రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.చిరంజీవి, టీడీపీ నాయకులు కె.శ్రీను, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

రోలుగుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. రత్నంపేట, పనసలపాడు, గంగవరం గ్రామాల్లో శనివారం జీడితోటల రైతులతో సమావేశం నిర్వహించారు. అధిక సంఖ్యలో గిరిజనులు, పేదలు జీడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రతీ ఏటా పెట్టుబడి సొమ్ము సైతం రాక నష్టపోతున్నారన్నారు. కిలోకు రూ.200 చొప్పున మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు నూరాజు, నాగన్న, అప్పారావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

-అల్లు సూర్యనారాయణ, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, చోడవరం



సబ్ డివిజన్ పరిధిలో రక్షిత నీటి పథకాల నిర్వహణను ప్రతి రోజూ పరిశీలించాలని కార్యదర్శులకు సూచించాం. తాగునీటి సమస్య పరిష్కారానికి మండలాల వారీగా టీములను ఏర్పాటు చేశాం. ప్రతి బోరుకూ మరమ్మతు చేసి జియో ట్యాగింగ్ చేస్తున్నారు. అన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్యపై మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో సమన్వయం చేసుకుని సాగుతున్నాం.

ప్రశ్న: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు సబ్ డివిజన్ పరిధిలో చేపడుతున్న చర్యలు ఏమిటి?

డీఈ: సబ్ డివిజన్ పరిధిలో రక్షిత నీటి పథకాల నిర్వహణను ప్రతి రోజూ పరిశీలించాలని కార్యదర్శులకు సూచించాం. ప్రతీ పంచాయతీలో అదనపు మోటారు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పాం. మోటారు మరమ్మతుకు గురైతే తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని పంచాయతీల్లో రెండో మోటారు అందుబాటులో ఉంచుకోవాలని సూచించాం.

ప్రశ్న: తాగునీటి బోర్ల మరమ్మతు పనులు ఎంతవరకు వచ్చాయి?

డీఈ: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా క్రాష్ ప్రోగ్రాం కింద ఇప్పటికే నాలుగు మండలాల్లోని 70 పంచాయతీల్లో బోర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చాం. ఎక్కడా ఉదాసీనతకు తావు లేకుండా మండలాల్లో జేఈలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. మండలాల వారీగా టీములు కూడా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: బోర్ల మరమ్మతు పనులు ఎంత వరకు వచ్చాయి. మెటీరియల్ కొరత ఏమైనా ఉందా?

డీఈ: బోర్ల మరమ్మతులకు సంబంధించి మెటీరియల్ అన్ని మండలాల్లో అందుబాటులో ఉంచాం. ఎక్కడా మెటీరియల్‌కు కొరత లేకుండా చూస్తున్నాం. ప్రతి బోరుకూ మరమ్మతు చేసి జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్య నివారణకు మీ ప్రణాళిక?

డీఈ: తాగునీటి కొరత తలెత్తే అవకాశం ఉన్న పంచాయతీల్లో ఇప్పటికే ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నది. నీటి పథకాలకు నీరు అందని పక్షంలో ప్రత్యామ్నా యంగా పథకాలకు మంచి నీరు అందించేలా ఈ వనరులను గుర్తించాం. దీనిపై సమగ్ర నివేదిక తయారు చేసి జిల్లా పరిషత్‌కు పంపించి, అందుకు అనుగుణంగా అనుమతులు పొందే ప్రయత్నాలు ప్రారంభించాం.

ప్రశ్న: తాగునీటి సమస్యపై అధికారుల స్థాయిలో చేపట్టిన కార్యాచరణ?

డీఈ: అన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్యపై మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతున్నాం. జేఈలతో పాటు నేను కూడా తాగునీటి సమస్యకు అవకాశం ఉన్న పంచాయతీలను పరిశీలించి పరిస్థితులను అంచనా వేస్తున్నాం.

-చోడవరం, ఆంధ్రజ్యోతి

ఆస్తి పన్ను బకాయిలు త్వరితగతిన చెల్లించాలి

నర్సీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిలను త్వరితగతిన చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర కోరారు. రూ.1.53 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. మునిసిపాలిటీలోని 17 సచివాలయాల పరిధిలో ప్రత్యేక టీమ్‌లు వేసి పన్నులు వసూలు చేస్తున్నామన్నారు. ఖాళీ స్థలాలపై పన్నులు రూ.58.24 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ నెలలో బకాయిలు చెల్లించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీపీఐ మహాసభలు రేపు

కె.కోటపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 16న సీపీఐ మండల మహాసభలు నిర్వహిస్తామని పార్టీ మండల కార్యదర్శి గొర్లె దేవుడిబాబు తెలిపారు. పేదలకు ఇళ్ల పట్టాల సమస్య, గోవాడ చక్కెర కర్మాగారంపై ప్రభుత్వ అలసత్వంతో చెరకు రైతుల కష్టాలపై చర్చిస్తామన్నారు. ఈ సభలకు జిల్లా కార్యదర్శి బాలేపల్లి, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారని, పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు.

నేడు మానవ వనరుల నిర్వహణపై సదస్సు

మాకవరపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మానవ వనరుల నిర్వహణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. ఇన్ఫోసిస్ టెక్నాలజీ లిమిటెడ్ విశాఖపట్నం, గ్లోబల్ ఇంజినీరింగ్ టెక్ మహీంద్రా హైదరాబాద్, లివరేజింగ్ టెక్నాలజీ ఇన్ సిల్క్ డెవలప్‌మెంట్ విశాఖపట్నంతో పాటు మరి కొన్ని కంపెనీల కార్యదర్శులు హాజరవుతున్నట్టు చెప్పారు. పరిశ్రమల్లో ఉద్యోగం సంపాదించే మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్టు ఆయన తెలిపారు.

ఆత్మస్థైర్యంతో 'పది' పరీక్షలు రాయాలి: సీఐ


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల విద్యార్థులు భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని అరకు సీఐ హిమగిరి అన్నారు. మండల కేంద్రంలోని బాలురు గిరిజన ఆశ్రమ, ప్రభుత్వ ఉన్నత, బాలికల పాఠశాలలను ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల ను పరిశీలించారు. మాస్‌కాపీయింగ్‌కు తావు లేకుండా చూడాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత చదువులతో ఎదగాలన్నారు. పరీక్షలను నిర్భయంగా రాయాలన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు గంజాయి, మాదక ద్రవ్యాలు, సైబర్‌క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దు


దుకాణాల్లో తనిఖీల్లో అధికారులు

పాడేరురూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు 100 చదరపు గజాల పరిధిలో ఎటువంటి పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని రాష్ట్ర లీగల్ కో-ఆర్డినేటర్ పుట్టా శివబాబు వ్యాపారులను హెచ్చరించారు. నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం పాడేరు సమీపాన చలిపుట్టులోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, శ్రీఅక్షర పబ్లిక్ స్కూల్ సమీపంలో శివబాబు ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. పలు షాపులలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించి వ్యాపారులకు చలానా విధించారు. పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై షాపు యజమానులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా, ఎన్‌సీడీపీవో డాక్టర్. ప్రతాప్, సోషల్ వర్కర్స్ మనోజ్‌కుమార్, శాంతకుమారి, ఆశ వర్కర్లు, ఏఎస్ఐ సూరిబాబు పోలీసులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు సీఎంను నిధులు కోరుతాం: గిడ్డి ఈశ్వరి

పాడేరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పాడేరులో మే 11, 12, 13 తేదీల్లో జరిగే మోదకొండమ్మ ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి నిధుల విడుదల చేయాలని సీఎం చంద్రబాబునాయుడుని కోరుతామని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి , మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపును తీసుకువచ్చింది తమ ప్రభుత్వమేనని, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముందుకు వస్తే, తాను సీఎం చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి నిధుల మంజూరుపై మాట్లాడతానన్నారు.

ఆదివాసీ సంఘం నేత శరభన్న మృతి

పెదబయలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ కిల్లో శరభన్న శుక్రవారం ఉదయం మృతి చెందారు. అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృత్యువాతపడినట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు చేసిన సర్భన్న మృతికి ఆ సంఘ నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. ఆయన కటుంబం పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


కిల్లో శరభన్న (ఫైల్)

శరబన్న మృతి సీపీఎంకి తీరనిలోటు

పాడేరురూరల్: ఆదివాసీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై 15 ఏళ్లగా పోరాటం చేసిన పెదబయలు మండల సీపీఎం నేత కామ్రేడ్ కిల్లో శరబన్న మృతి గిరిజన ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా, సీఐటీయూ మండల కార్యదర్శిగా ఆయన అనేక పోరాటాలు చేశారన్నారు.


శిథిలమైన చిలకలగెడ్డ పాఠశాల భవనం


తాత్కాలిక షెడ్డు ఎదుట విద్యార్థులు, ఉపాధ్యాయిని ఝాన్సీరాణి

భయం నీడన చదువులు

- శిథిలమైన చిలకలగెడ్డ జీపీఎస్ పాఠశాల భవనం
- ఉపాధ్యాయిని సొంత నిధులతో నిర్మించిన షెడ్డులో తరగతులు

అనంతగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మన్యం ముఖద్వారమైన చిలకల గెడ్డ పంచాయతీ దాసరితోట గ్రామంలో జీపీఎస్ పాఠశాలకు భవనం కరువైంది.. చాలా ఏళ్లక్రితం నిర్మించిన తరగతి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2022లో బదిలీపై వచ్చిన ఎం.ఝాన్సీరాణి ఉపాధ్యాయురాలు.. పాఠశాల అభివృద్ధికి కృషిచేశారు.. ఆమె రాకముందు వరకు అంతంతమాత్రంగా ఉన్న విద్యార్థుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. రోజూ చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి, తల్లిదండ్రులను అవగాహన కల్పించి, విద్యార్థులను పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం 22 మంది వరకు పాఠశాలలో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు..

ఏళ్లక్రితం నిర్మించిన భవనం

22 ఏళ్లక్రితం నిర్మించిన పాఠశాల భవనం కావడంతో వర్షాలకు పూర్తిగా కారిపోతుండడంతో పాటుగా శ్లాబ్ పెచ్చులూడిపోయి ఏక్షణంలో ప్రమాదాలు చోటుచేసుకుంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు భవనంలో లోన ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో.. 2024లో జూన్ నెలల పాఠశాల పునఃప్రారంభానికి.. ఉపాధ్యాయురాలు ఝాన్సీరాణి తనసొంత నిధులు రూ.30 వేలు వెచ్చించి పాఠశాల ఆనుకుని రేకుల షెడ్డు వేయించడంతో పాటుగా గచ్చుచేయించారు.. ప్రస్తుతం విద్యార్థులు అందులోనే చదువుకుంటున్నారు. కూలే స్థితిలోని పాత పాఠశాల భవనాలు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు సంబంధించిన సామగ్రి సైతం ఎండకు ఎండుతూ, వర్షాలకు తడిచిపోతోంది. రికార్డులు సైతం భద్రపరిచేందుకు వీలులేకుండాపోయింది. విద్యా శాఖ ఉన్నతాధికారులు తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని, పాఠశాల భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు సురేశ్, పైడిరాజు, జమ్మన్నదొర వేడుకుంటున్నారు.

ఏజెన్సీలో చట్టాల నిర్వీర్యానికి కుట్ర


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నేత అప్పలనర్స

పాడేరురూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత పరిరక్షణకు అమలులో ఉన్న చట్టాల రద్దుకు పాలకులు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, డీఈవో కేంద్ర కమిటీ ప్రతినిధి ఎస్.మాణిక్యం, రిటైర్డ్ తహసీల్దార్ టి.చిరంజీవిపడాల్ పిలుపునిచ్చారు. ఆదివాసీ అఖిల పక్ష ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక పీఎంఆర్సీ భవనంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మానపడాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాతూ తరచూ ఆదివాసీ హక్కులు, చట్టాల రద్దుపై నాయకులు చేసినవ్యాఖ్యలతో ఆదివాసీలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని బీజేపీ ఎంపీ డీకే.అరుణ, సిందూరు రెడ్డి చేస్తున్న ప్రకటనలను వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు. ఇటీవల కొందరు చేసిన1/70 చట్టాన్ని నీరుగార్చే వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.ఈ సమావేశంలో వివిధ సం ఘాల నాయకులు కూడా రాధాకృష్ణ, పి.బాలదేవ్, ధనుంజయ్, కాంతారావు, రమణమ్మ, విమల, ఊర్మిళారాణి, చిన్నారావు, కె.సుబ్రమణ్యం, భాను, రాజబాబు, జి.సత్యం, గంగాధర్, కోటిబాబులున్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలు విజయవంతానికి కృషి

- ఆలయ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


విరాళాల సమోదులో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, సభ్యులు

పాడేరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మే నెల 11, 12, 13 తేదీల్లో జరిగే మోదకొండమ్మ ఉత్సవాలను విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆలయ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఉత్సవ విరాళాల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలో ప్రారంభించారు. అనంతరం ఉత్సవ కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా జరిగే మోదకొండమ్మ ఉత్సవాలకు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, భక్తులు విరివిగా విరాళాలు అందించాలన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశామన్నారు.. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి కిల్లు కోటినాయుడు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పాడేరు, జి.మాడుగులల్లోని సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్నందున ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఆ మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్యకర్తలను విస్మరిస్తున్న వైసీపీ అధిష్ఠానం

- పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు మోరి రవి


మాట్లాడుతున్న రవి

చింతపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పాడేరు నియోజక వర్గంలో కార్యకర్తలను వైసీపీ అధిష్ఠానం విస్మరిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి విమర్శించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రం వ్యాప్తంగా వైసీపీ ఓటమిపాలైనా, గిరిజన ప్రాంత ప్రజలు, కార్యకర్తలు అరకు, పాడేరు నియోజక వర్గంలో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తూ వస్తున్నారన్నారు. ఇంతగా కష్టపడి పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలను అధిష్ఠానం కాపాడుకోవాల్సి ఉందన్నారు. కానీ, పాడేరు నియోజకవర్గం విషయంలో పార్టీ అధిష్ఠానం ఒంటెద్దుపోకడలతో వ్యవహరిస్తోందన్నారు. అధిష్ఠానం వైఖరి వల్ల యువజన పోరు కార్యక్రమానికి కార్యకర్తలు పూర్తి స్థాయిలో హాజరుకాలేదన్నారు. పార్టీ పదవులు సైతం జిల్లా నాయకులకు నచ్చిన వ్యక్తులకే కట్టబెడుతున్నారన్నారు. తాను ప్రతి ఎన్నికల్లో పార్టీ విజయానికి అహర్నిశలు కష్టపడి పనిచేశానని, పార్టీ నాయకులు తప్పు చేస్తే ప్రశ్నిస్తానన్నారు. దీనివల్ల తనను పలువురు టార్గెట్ చేస్తారని, అయినా తుది శ్వాస వరకు పార్టీలో కొనసాగుతానన్నారు.

'ఉనికి కోసమే వైసీపీ నేతల ప్రయత్నం'

చింతపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఉనికిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నా, ప్రజల నుంచి వారికి స్పందన కరువైందని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను ఖాళీచేసి అప్పుల భారాన్ని మోపిన వైసీపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారు. మరోవైపు అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టాలనే ఉద్దేశ్యంతో యువజన పోరు కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. పాడేరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిరిజన యువత ఒక్కరూ కనిపించలేదన్నారు. ఏజెన్సీలో వైసీపీకి కాలం చెల్లిందని యువజన పోరుతోనే స్పష్టమైందన్నారు.

కలుషిత తాగునీటినుంచి కాపాడాలి

- సుండ్రుపుట్టు వాసులు ఆందోళన


మురుగుకాలువలో పైప్‌లైన్ పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న మహిళలు

పాడేరురూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాడేరు మేజర్ పంచాయతీ కేంద్రంలో ఉన్న సుండ్రుపుట్టులో కలుషిత నీటి సమస్యనుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాడేరు - విశాఖ ప్రధాన రహదారి పక్కనే ఉన్న సాయిబాబా ఆలయం నుంచి ప్రభుత్వ డిగ్రీకళాశాల వరకు గల సుండ్రుపుట్టు గ్రామంలో నివసిస్తున్న వారికి తాగునీటిని అందించే ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురైంది. దీంతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నుంచి వచ్చే మురుగు నీరు ఆ పైపులోకి చేరి నీరు కలుషితమవుతోంది. దుర్వాసనతో కూడిన జలాలు వస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని మహిళలు డిమాండ్ చేశారు.

ప్రతీ సోమవారం 'మీకోసం'

జి.మాడుగుల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం మండల ఎంపీడీవో కార్యాలయంలో మీ కోసం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు పా ల్గొంటారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- విజయనగరం ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సియ్యారి దొన్నుదొర


కొట్టి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దొన్నుదొర

పెదబయలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోనల్ ఛైర్మన్ సియ్యారి దొన్నుదొర పేర్కొన్నారు. శుక్రవారం మండలం బొంగరం పంచాయతీ పరిధి చట్రాయిగూడ నుంచి మొట్టగుమ్మి వరకు 3.9 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీటి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ గిరిజన పల్లెకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి పాలనలోకి వచ్చిన వెంటనే పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో రోడ్డు, తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, పక్కా గృహాలు మంజూరు చేస్తున్నట్టు వివరించారు. గ్రామాలన్నింటికీ త్వరలో పక్కా రోడ్లు వేస్తామన్నారు. గత వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. గాడి తప్పినపాలనను కూటమి ప్రభుత్వం సరిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పీపీ వరహాలమ్మ, స్థానిక సర్పంచి ఉడ్డు లక్ష్మీపతి, ఎంపీటీసీ సభ్యులు మత్స్యకొండబాబు, కిమంకరి బొంజుబాబు, పురశకారి భాస్కరరావు, మాజీ ఎంపీపీ కొండయ్య, నాయకులు లొట్టి చిన్ని, వినోద్, మోహనరావు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

లోతుగెడ్డలో వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, సర్పంచి సునీల్

చింతపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుగెడ్డ గ్రామ పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ కమిటీ ఛైర్మన్, సర్పంచి చింతర్ల సునీల్ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈకార్యక్రమానికి జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ముఖ్యఅతిథులుగా హాజరై స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. యాగశాలలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు, స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, వర్తక సంఘం ప్రధానకార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, నాయకులు దుర్గా ప్రసాద్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘం నేత చింతర్ల సాగర్, ఎస్సైసత్యనారాయణ, జీసీసీ మేనేజర్‌వెంకటేశ్, సర్పంచిపాండురంగస్వామి పాల్గొన్నారు.

ఆవిర్భావ సభకు జనసేన శ్రేణులు పయనం


కొయ్యూరునుంచి బయలు దేరిన జనసేన నాయకులు

కొయ్యూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం వేదికగా శు క్రవారం జనసేన పార్టీ నిర్వహించిన పార్టీ ఆవిర్భావ సభకు కొయ్యూరు నుంచి ఆ పార్టీ మండల అధ్యక్షుడు గూడెపు లక్ష్మణ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్, నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య పిలుపు మేరకు మండల కేంద్రం నుంచే సుమారు 200 మంది కార్యకర్తలు ఈ సభకు బయదేరారు. వీర మహిళల అధ్యక్షురాలు సెగ్గే భావన సాయి జయంతి సభకు బయలు దేరిన వాహనాలకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల గౌరవ అధ్యక్షులు బుజ్జిబాబు, కార్యదర్శి శేషుబాబు, ఆర్గనైజర్ సుధీర్‌బాబు, నేతలు పవన్, నవీన్, రాజేష్, నాగేంద్ర, కుమార్, శివాజీ, రాఘవరాజు బంగారుబాబు, నానాజీ తదితరులు ఉన్నారు.

పోక్సో చట్టంపై సదస్సు రేపు

సీలేరు, మార్చి 14 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16 (ఆదివారం)న పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా ప్రిన్సిపల్ జడ్జీ ఆదేశాలమేరకు ఆరోజు ఈ కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. లైగింక నేరాల నుంచి పిల్లలను రక్షించే చట్టం, బాలికలు , పిల్లలతో వెట్టిచాకిరీ, డోపిడీ నియం త్రణపై ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు అవగాహన కల్పిస్తారన్నారు.

సమస్యలపై చింతలవీధిలో ఆందోళన

పాడేరురూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవీధి పంచాయతీ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ఎల్.సుందరరావు ఆధ్వర్యంలో చింతలవీధి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చేపడుతున్న ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా చింతలవీధి పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు సమస్యలపై 45 దరఖాస్తులిచ్చారన్నారు. ఈ సమస్యలపై సచివాలయ కార్యదర్శి అశోక్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.బొజ్జన్న, సతీష్, రమణ, చిన్నబాబు, సోమన్న నడిమివీధి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాణిజ -చినకోనెల రోడ్డు పనులకు అనుమతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్...

అనంతగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకోనెల గ్రామాల రహదారి నిర్మాణ పనులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ సమక్షంలో అటవీశాఖ అనుమతులు జారీ అయ్యాయి. 'డోలీ కష్టాలు తీరేదెన్నడో?' అనే శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించారు.. 2024లో ఉపాధిహామీ పథకం ద్వారా మెంటాడ మండలం వాణిజ నుంచి బూరిగ, చినకోనెల గ్రామాలకు రహదారికి రూ. 3 కోట్ల నిధులు మంజూరయ్యాయి.. అయితే అటవీశాఖ అనుమతులు లేక మధ్యలో నిలిచిపోయాయి. ఈనెల 11న ఇద్దరు వృద్ధులను డోలీమోత అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో.. కలెక్టర్ స్పందించి ఈ రోడ్డుతోపాటు కొటెంగుడ, కడరేవ్, కడరేవ్ నుంచి కర్రిగుడ వరకు రోడ్డు పనులకు అనుమతులిచ్చారు.

ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవం


ఫీడర్ అంబులెన్సులో ప్రసవించిన శిశువుతో లింబో

కొయ్యూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ శనివారపుపాడుకు చెందిన గెమ్మెలి లింబో ఫీడర్ అంబులెన్స్‌లో బుధవారం రాత్రి ప్రసవించింది. శనివారపుపాడుకు చెందిన లింబోకు గురువారం రాత్రి పురిటినొప్పులు వచ్చాయి. ఈ విషయాన్ని కుటుంబీకులు ఫీడర్ అంబులెన్స్‌కు సమాచారమందించారు. వెంటనే అంబులెన్స్‌తో గ్రామానికి చేరుకున్న ఈఎంటీ విజయ్‌కుమార్ గర్భిణి లింబోను రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికం కావడంతో ప్రసవించింది. దీనిని గుర్తించిన ఈఎంటీ శిశువును శుభ్రం చేసి తల్లికి అందించి మెరుగైన వైద్య సేవలకు పీహెచ్‌సీకు తరలించారు. సకాలంలో అంబులెన్స్ తీసుకువచ్చి సురక్షితంగా ప్రసవించేలా చర్యలు తీసుకున్న ఈఎంటీకి కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.


డుంబ్రిగుడలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు


ముంచంగిపుట్టులో..

ఆనందోత్సాహాల మధ్య హోలీ వేడుకలు

సీలేరు, మార్చి 14 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు,ధారకొండల్లో శుక్రవారం ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలను జరుపుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు, మార్కెట్ సెంటర్‌లో యువత, చిన్నారులు ఉదయం నుంచే ఒకరిపైఒకరు రంగులు జల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు. అలాగే ధారకొండలో కూడా యువకులు, చిన్నారులు హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీలేరు, ధారకొండల్లో ఉదయం నుంచి యువత, చిన్నారుల హోలీ వేడుకలతో సందడి నెలకొంది.

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు, దారెల, కొండపడ, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో గురువారం రాత్రి రాధాకృష్ణుల ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోలీ సందర్భంగా రాత్రి ఏర్పాటు చేసిన జాతర్ల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒకరికి ఒకరు రంగులు రాసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముంచంగిపుట్టు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఏర్పాటుచేసిన ఉట్టుకొట్టే కార్యక్రమానికి యువకులు పోటీ పడ్డారు. రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.


సీలేరులో చిన్నారుల కేరింతలు

డుంబ్రిగుడ: మండలంలో హోలీ పండుగను ఘనంగా జరిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు కేరింతలతో ఒకరికొకరు రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డుంబ్రిగుడలోని పలు వీధుల్లో చిన్నారులు సందడిగా తిరిగారు.

మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

పాడేరురూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షకు హాజరుకానున్న జిల్లాలోని అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బీసీ, ఈబీసీ కేటగిరిలకు చెందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌కు టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారఅధికారి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయ భవనం, పాడేరు చిరునామాకు పంపించాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్: 81069 99039 నంబర్‌ను సం ప్రదించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ముంచంగిపుట్టు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 17 నుంచి 31 తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో క్రిష్ణమూర్తి తెలిపారు. మండల పరిధిలో మొత్తం 490 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. మొత్తం మూడు సెంటర్లను ఏర్పాటు చేశామని, సమస్యాత్మక సెంటర్లలో సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మాస్ కాపీయింగ్ జరగకుండా స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపీడీవో, పీఆర్‌జేఈ, ఎంఈవో(1)లను జిల్లా పరీక్షల విభాగం నియమించినట్లు చెప్పారు.

బాలికల వసతి గృహంలో కరాటే శిక్షణ



బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కశింకోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమగ్ర సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 150 మంది బాలికలకు కరాటే శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఎస్ఐ కె.లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ శిక్షణను ప్రారంభించారు. మహిళల స్వీయరక్షణకు ఇటువంటి శిక్షణలు ఎంతో అవసరమన్నారు. బాలికల్లో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకే ఈ తరగతులు నిర్వహిస్తున్నట్టు కరాటే ఉపాధ్యాయుడు ఈశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ డే



వేడుకల్లో కేక్ కట్ చేసిన డాక్టర్ శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ డేను ఎన్టీఆర్ వైద్యాలయం సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. డీసీహెచ్ఎస్, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్స్‌గా ప్రభుత్వ సర్వీస్‌లో చేరి అదే గ్రేడ్‌లో పదవీ విరమణ పొందుతున్నారని వాపోయారు. ఇకనైనా ఇటువంటి వారికి పదోన్నతి కల్పించాలని ఓ తీర్మానంలో కోరారు. ల్యాబ్ టెక్నీషియన్ల గ్రేడ్-2 కేడర్‌ను జోనల్ కేడర్ పోస్టుగా మార్పు చేయాలని, ప్రతి పీహెచ్‌సీకి రెండవ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.గీతారాణి, కార్యదర్శి మీసాల సూర్య శంకరరావు, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రెండు ఎకరాల విస్తీర్ణంలో నీలగిరి తోట దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన యూకలిప్టస్ చెట్లు

పరవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భరణికం గ్రామ శివారులో గల నీలగిరి తోటల్లో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో తోటలు దగ్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. గ్రామంలోని బొండా గోవింద్‌కు చెందిన నీలగిరి తోటల్లో మధ్యాహ్నం 12 గంటల సమయంలో అగ్ని కీలలు ఎగసి పడడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే రాంకీ సంస్థకు చెందిన అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకునే లోపే సుమారు రెండు ఎకరాల్లో తోటలు దగ్ధమయ్యాయి. గంటకుపైౖ శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బొండా గోవింద్, వడిశల మహేశ్‌కు చెందిన నీలగిరి తోటలు దగ్ధమయ్యాయి. వీఆర్వో శ్రీనివాసరావు సంఘటనా స్థలికి చేరుకొని నష్టంపై అంచనా వేశారు.

తాకాశి వీధి నూకాంబిక జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకుడు రాంకీ, తదితరులు

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తాకాశివీధిలో జరగనున్న నూకాంబిక అమ్మవారి జాతరకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఇక్కడ జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ భీమరశెట్టి రాంకీ ఆవిష్కరించారు. ఈనెల 28 నుంచి కొత్త అమావాస్య జాతర ప్రారంభం కానుంది. కమిటీ చైర్మన్ తాకాశి కిశోర్, జనసేన నాయకులు తాకాశి కన్నబాబు, గోవిందరావు, రామకృష్ణ, సత్యందొర, గణేష్, ఈశ్వరరావు, భరిణికాన రాము పాల్గొన్నారు.

ఇ- మర్రిపాలెం ఫ్లై ఓవర్‌పై మరమ్మతులు

- స్తంభించిపోతున్న ట్రాఫిక్
- వాహనచోదకులకు ఇక్కట్లు
- పరవాడ, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ స్టేషన్‌లకు సరిహద్దు కావడంతో పట్టించుకోని పోలీసులు!



రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు

లంకెలపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- గాజువాక మార్గంలోని ఇ- మర్రిపాలెం వద్ద గల ఫ్లై ఓవర్‌పై గత నాలుగు రోజులుగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పనుల్లో భాగంగా రహదారి సగ భాగం వరకు స్టాపర్లు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలు మరింత కష్టంగా మారాయి. జాతీయ రహదారి కావడంతో నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే నగరం నుంచి ఫార్మాసిటీకి ఉద్యోగులు, కార్మికులు వెళ్లి వస్తుంటారు. బ్రిడ్జి దగ్గరకు వచ్చేసరికి రహదారిపై పనులు చేస్తుడడంతో సగభాగం స్టాపర్‌లు అడ్డుగా ఉండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. లంకెలపాలెం కూడలి వరకు వాహనాలు బారులు తీరుతున్నారు. ఫార్మా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు వచ్చే సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. లంకెలపాలెం నుంచి అగనంపూడి వెళ్లాలంటే సమారు గంటకుపైగా సమయం పడుతుంది. పరవాడ, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లకు సరిహద్దు ప్రాంతం కావడంతో పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటే కొంత మేర ఇబ్బందులు తప్పుతాయని వాహన చోదకులు చెబుతున్నారు.

విస్తరణపై ఉలుకూ.. పలుకూ.. లేదు!

- ప్రజా ప్రతినిధులు మారుతున్నా పట్టని సమస్య
- నిత్యం రద్దీగా ఉంటుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు
- అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం

నూకాంబిక ఆలయ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?



జాతీయ రహదారిలోని నూకాంబిక ఆలయ ముఖద్వారం

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజా ప్రతినిధులు మారుతున్నా.. అధికారులు మారుతున్నా.. ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ రోడ్డు విస్తరణకు మాత్రం మోక్షం లభించడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ (నాటి వుడా) ఆధ్వర్యంలో రూ.ఏడున్నర కోట్లతో రోడ్డు విస్తరణకు పనులు ప్రారంభించారు. అనతి కాలంలోనే ప్రభుత్వం మారడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన నిలిచిపోయాయి. ఆ నాటి నుంచి ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టణానికి ఎంతో ముఖ్యమైన నూకాంబిక ఆలయ రోడ్డు విస్తరణపై దృష్టి పెట్టలేకపోయింది. వుడా నిధులు మం జూరు కాకపోవడంతో జీవీఎంసీ అధికారులే ఈ రోడ్డు విస్తరణ, నిర్మాణానికి సుమారు రూ.ఆరు కోట్ల వరకు నిధులు



నూకాంబిక ఆలయానికి వెళ్లే రహదారి

కేటాయించినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. జాతీయ రహదారిలోని నూకాంబిక ఆలయ ముఖద్వారం నుంచి సంతబయలు, నూకాంబిక ఆలయం, పూల్‌బాగ్‌రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు వరకు 2.5 కిలోమీటర్ల దూరంలో రోడ్డు విస్తరణ, అభివృద్ధికి గతేడాది జూన్ ముందు వరకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో ఈ రోడ్డు విస్తరణ 80 అడుగులు చేయాల్సి ఉన్నప్పటికీ 60 అడుగులకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ రోడ్డులో మొత్తం 176 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులున్నాయని అప్పట్లో అధికారులు గుర్తించారు. గత ఏడాది ప్రారంభంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డు విస్తరణకు సంబంధించి మార్కింగ్ కూడా చేశారు. అప్పట్లో జీవీఎంసీ సిటీ ప్లానర్ కూడా ఈ రహదారిని పరిశీలించారు.

పనులు జరిగితే ట్రాఫిక్ సమస్య పరిష్కారం

ఈ మార్గం విస్తరణ జరిగితే పట్టణంలోని ప్రధాన మెయిన్ రోడ్డుకు ట్రాఫిక్ సమస్య బాగా తగ్గే అవకాశాలున్నాయి. ఈ మార్గంలో మునగపాక మండలం గవర్ల అనకాపల్లి, సిరసపల్లి, తోటాడ, వెంకటాపురం గ్రామాల ప్రజలే కాకుండా పరవాడ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కూడా అనకాపల్లికి వచ్చి వెళుతుంటారు.

జాతరలో ఈ రహదారిలో ప్రయాణం ఇబ్బందే....

ఏటా నూకాంబిక అమ్మవారి జాతర మార్చి నుంచి ఏప్రిల్ వరకు జరుగుతుంటుంది. ఆ నెల రోజులే కాకుండా జాతర ప్రభావం మరో మూడు నెలలు వరకు కొనసాగుతుండడం వల్ల ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. విశాఖ మార్గంలో వచ్చే చాలా మంది భక్తులు జాతీయ రహదారి మీదుగా తోటాడ జంక్షన్ వద్ద గల నూకాంబిక ఆలయ ముఖద్వారం లోబడి ఆలయానికి చేరుకుంటారు.

ఇదిలావుంటే, కొంతకాలం క్రితం వరకు ఆది, మంగళ, గురువారాల్లో అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడేది. ఇటీవల కాలంలో ఆలయానికి నిత్యం భక్తుల తాకిడి పెరగడంతో ఈ మార్గంలో కోలాహల అధికమైంది. ముఖ్యంగా ఆదివారం రోజున ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అమ్మవారి దర్శనానికి భారీ ఎత్తున భక్తులు కుటుంబాల సమేతంగా వస్తుంటారు. అయితే ఆదివారం రోజున ఆలయ మార్గంలో ఉన్న సంతబయలు వద్ద వారపుసంత నిర్వహిస్తుంటారు. రోడ్డుపైనే పలువురు చిల్లర వర్తకులు అమ్మకాలు చేస్తుంటారు. దీంతో ఆ రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ మార్గంలో ఆలయానికి వచ్చే భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. భక్తులు ఇబ్బందులు తొలగా లంటే రోడ్డు విస్తరణ పనులు జరగాల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ రోడ్డు విస్తరణను అరవై అడుగులు చేపట్టాలని జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో ప్రస్తుతం విస్తరణకు ప్రారంభమైన పెరుగుబజార్ రోడ్డు 60 నుంచి 50 అడుగులకు తగ్గించి పనులు చేపడుతున్నందున నూకాంబిక ఆలయ మార్గం కూడా 50 అడుగులకే విస్తరించాలని విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న వారు అధికారులను కోరడం కూడా విస్తరణకు ఒక సమస్యగా మారినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది.

ఏది ఏమైనా విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న వారితో కనీసం సమావేశం కూడా ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించేందుకు జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం ఈ రోడ్డు విస్తరణ పనుల పై దృష్టి సారించడం లేదని విమర్శలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినందున ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు జరిగేలా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయమై జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రోడ్డు విస్తరణ పనులు తన దృష్టిలో లేవన్నారు. ఈ రోడ్డు విస్తరణ జరిగితే మంచిదేనన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులను అడిగి ఫైల్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఇన్‌చార్జి ఏసీపీ వెంకటరావును వివరణ కోరగా, ఇందుకు సంబంధించిన ఫైల్‌ను పరిశీలించి చెబుతామన్నారు.

కోలాహలంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న పార్టీ నాయకులు

కశింకోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న, నాయకులు పావాడ కామరాజు, దాడి నాగరాజు జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఎంతో తోడ్పడుతున్నారని, పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం పిఠాపురంలో జరిగే ఆవిర్భావ దినోత్సవానికి తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉత్తాడ రామరాజు, వేగి రామకోటి, బొడ్డేడ బాలాజీ, గొంతిన అప్పాజీ, బుదిరెడ్డి మోహన్, బొబ్బరి పవన్‌నాయుడు, సంతోష్, గుంటూరు సాకేత్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా హోలీ వేడుకలు



స్టేడియంలో పిల్లలు, పెద్దల సంబరం



అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం హోలీ వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రాజస్థాన్ నుంచి వివిధ వ్యాపారాల నిమిత్తం అనకాపల్లి, అచ్యుతాపురం, చోడవరం ప్రాంతాలకు వచ్చిన మర్వాడీలు ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరి కొకరు రంగులు పులుముకొని డ్యాన్స్‌లు చేస్తూ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. కొందరు యువకులు చేతిలో కర్రలు పట్టుకొని హిందూ సాంప్రదాయమైన కోలాటాల మాదిరిగా డ్యాన్సులు చేశారు. పట్టణానికి చెందిన విష్ణు సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో చావల్‌సింగ్, పర్‌బత్‌సింగ్, తేజాసింగ్, కీమారామ్‌చౌదరి, నకుల్‌సింగ్, కృష్ణారామ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో పూజలు

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఫాల్గుణ పౌర్ణమి లక్ష్మీదేవి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలతో లక్ష్మీదేవి అష్టోత్తర నామాలతో పూజ, పారాయణాన్ని జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ వివాదం కేసులో నలుగురి అరెస్టు

కొత్తూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం చేనులగ్రహారంలో ఈ నెల తొమ్మిదో తేదీన ఫ్లెక్సీ వివాదంలో జరిగిన కొట్లాట కేసులో నలుగుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త నర్సింగరావు, ఆమె కుమారులపై అదే గ్రామానికి చెందిన మధుపాడ శ్రీనివాసరావు, రుత్విక్, కిశోర్, దుర్గా ప్రసాద్ నలుగురూ దాడి చేయడంతో వీరు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఈ సంఘటనపై నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు అరెస్టు చేశామన్నారు.



ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న లోకనాథ్, తదితరులు

'అచ్చియ్యపేటలో కేంద్రీయ విద్యాలయం నిర్మించాలి'

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం

కొత్తూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో కేటాయించిన స్థలంలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పార్టీ నేతలతో కలిసి సీతానగరం సర్వే నంబరు 511లో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి రూ.28.74కోట్లు కేటాయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఎన్నికల ముందు కేంద్రీయ విద్యాలయం తీసుకొస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ భూములను పెద్దలు కాజేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీలను పరిశీలించారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు, గొర్రెల మేకల పెంపకందారులు జిల్లా అధ్యక్షుడు ఉరిగిటి శివ సూర్యనారాయణ, రైతు సంఘం నాయకుడు గండి నాయినబాబు, వార్డు మెంబర్ ఉరిగిటి ఆదినారాయణ, మహాలక్ష్మి నాయుడు, సుబ్బి సత్యారావు, పాము గోవింద, అప్పలరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భోగలింగేశ్వరుని కల్యాణం



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భోగలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి కల్యాణాన్ని జరిపించారు. స్వామివారికి ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ధర్మకర్తలు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ధర్మకర్తలు మద్దాల నారాయణరావు, మళ్ల సూరిబాబు, పెంటకోట గణేష్‌కుమార్, రాపేటి సంతోష్‌కుమార్, సర్వకామదాంబ ఆలయ మాజీ చైర్మన్ కొణతాల కారుబాబు, అర్చకులు పేరూరి సూర్యనారాయణ, భోగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

నాగులాపల్లి గ్రోయిన్ మరమ్మతులకు ఆందోళన



నాగులాపల్లి గ్రోయిన్ వద్ద ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నేతలు

కొత్తూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో గల నాగులాపల్లి గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టాలని అఖిలపక్ష నాయకుడు, గ్రామాభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. అఖిలపక్ష నేతలతో కలిసి శుక్రవారం గ్రోయిన్‌ను పరిశీలించి ఆందోళన చేపట్టారు. అనకాపల్లి ప్రాంత పరిసర గ్రామాల రైతులకు సాగు, తాగునీరు అందిస్తున్న నాగులాపల్లి గ్రోయిన్ దశాబ్దాల కాలంగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. త్వరలో వేసవి ఆరంభం కానున్న తరుణంలో గ్రోయిన్‌పై ఆధారపడి ఉన్న పది గ్రామాల ప్రజలకు, పట్టణ ప్రాంత ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెంటనే మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి కొణతాల హరినాథ్‌బాబు, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు, ఏపీ రైతు సంఘం కార్యదర్శి కోరిబిల్లి శంకరరావు, రైతులు బొర్ర రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం

అనకాపల్లి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవాలను శనివారం నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో గల రెండు కోర్సులు డీఈసీఈ, డీసీఎంఈలలో విద్యార్థులు శతశాతం ప్లేస్‌మెంట్ సాధించిన సందర్భంగా జరపనున్నామన్నారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రామాపురం కాలనీ వద్ద శుక్రవారం ఓ వ్యక్తి నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. రామాపురం కాలనీకి చెందిన షేక్ ఫరీద్ మద్యం క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి వెళ్తుండగా హెచ్‌సీ శ్రీనివాసరావు స్వాధీనం చేసుకున్నారన్నారు.



నెహ్రూచౌక్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

- వామపక్ష నేతల డిమాండ్
- అనకాపల్లి, పరవాడలో నిరసన

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని కోరుతూ ఇక్కడి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద శుక్రవారం వామపక్ష నాయకులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంటుకు రూ.11వేల కోట్లు ప్యాకేజీ ప్రకటించి చేతులు దులుపుకోవాలని చూస్తుందన్నారు. ఆ నిధులు ప్లాంట్ నడపడానికి, జీతాలు, ముడిసరకుకు ఖర్చు చేయొద్దని ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి నాయకులు స్టీల్‌ప్లాంటు సమస్యను పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచనతోనే గనులు కేటాయించడం లేదని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దొరబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్‌తో పాటు ఎ.రాజు, కాళ్ల తేలయ్యబాబు, అప్పారావు, సీపీఐ నాయకుడు అప్పలరాజు, కె.శంకరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సినిమాహాల్ కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును కేంద్ర ప్రభుత్వమే పూర్తి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.నాయుడు, జి.శ్రీనివాసరావు, ఎన్.గుర్నాథరావు, బి.శ్రీను, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.


పవన్ అభిమానం

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

ఉపాధ్యాయ బదిలీలు మాన్యువల్‌గానే జరగాలి

తుమ్మపాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్ విధానంలో కాకుండా మేన్యువల్‌గా చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ కోరారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన సమస్యలను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ద్వారా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ఎస్‌జీటీలకు మాత్రం ఆన్‌లైన్ బదిలీల కౌన్సెలింగ్ అంటూ కొందరు అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారన్నారని. దీనిని ఉపాధ్యాయులంతా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో గిరిజన ప్రాంతానికి ఊహించని విధంగా బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను సవరించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి నక్కా శీనుబాబు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు రొంగలి అప్పలరాజు, సంఘం ప్రతినిధులు కోట్ని రాంబాబు, వీరునాయుడు, లక్ష్మణ్, లోకేశ్, విద్యాసాగర్, రాజా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుని తీవ్ర గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. గవరపాలెం దాడి వారి వీధికి చెందిన భీశెట్టి జోగరత్నం (76) ఈ నెల 10వ తేదీన ఉదయం ఇంట్లో పూజ చేస్తూ దీపం వెలిగించి హారతి ఇస్తుండగా మంట చీరకు అంటుకుంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. భర్త భీశెట్టి నూకఅప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

డీఎస్సీ కోచింగ్ వెబ్ ఆప్షన్స్ నమోదు నేటితో ముగింపు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న టీచర్ పోస్టులకు సంబంధించి నిర్వహించే మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు వెబ్‌ఆప్షన్స్ అందుబాటులో ఉన్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారిణి కె.రాజేశ్వరి తెలిపారు. షార్ట్‌లిస్టు చేయబడిన అభ్యర్థులు వారి ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ సంస్థలను కేటాయించడానికి వెబ్ ఆప్షన్స్ ఈ నెల 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెబ్ ఆప్షన్స్ " సర్వీస్ జన్మభూమి" హెచ్‌టీటీపీఎస్://ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

సింహాద్రి అప్పన్నకు పెళ్లి కుదిరింది

» ఏప్రిల్ 8న తిరుకల్యాణ మహోత్సవం


అప్పన్నస్వామి

సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం. అప్పన్న సహోదరి పైడితల్లి అమ్మవారి కుమార్తె శ్రీమహాలక్ష్మితో నిశ్చయమైంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చైత్రమాస శుక్లపక్ష ఏకాదశి నాడు అనగా ఏప్రిల్ 8న సింహాద్రినాథుని వార్షిక తిరుకల్యాణ మహోత్సవం జరగనున్నది. అంతకుముందు చైత్రమాస పాడ్యమి అంటే..ఈ నెల 30న ఉగాదినాడు పందిరిరాట ఉత్సవం నిర్వహిస్తారు.

సంపద సృష్టిద్దాం!

పంచాయతీల వద్ద నిధులు లేకపోవడం, కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించడంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకపోయింది. దీంతో వారు విధులకు రావడం మానేశారు. దీంతో సంపద తయారీ కేంద్రాలు క్రమేపీ మూతపడ్డాయి. పంచాయతీల పారిశుధ్య సిబ్బంది వీధుల్లో సేకరించిన చెత్తను గ్రామాల శివారులో రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో పడేసేవారు. చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వచ్చేది. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో వేల టన్నుల చెత్త పేరుకుపోయింది.

వినియోగంలోకి సంపద కేంద్రాలు

గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీ అధికారులకు గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. గతంలో నిర్మాణంలో ఆగిపోయిన కేంద్రాల్లో మిగిలిన పనులు పూర్తిచేసి వాటిని కూడా అందుబాటులోకి తేవాలని ఆదేశించింది. సంపద తయారీ కేంద్రాల ఆవరణలను కిచెన్ గార్డెన్లుగా అభివృద్ధి చేయనున్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించడానికి గ్రీన్ అంబాసిడర్లను నియమించుకుని, వారికి పంచాయతీలే వేతనాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి..

మందకొడిగా అందుబాటులోకి..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగిస్తూ గత ఏడాది అక్టోబరు 2న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఐదు వందలకుపైగా సంపద తయారీ కేంద్రాలు వుండగా, ఇంతవరకు 250 కేంద్రాలు మాత్రమే వినియోగంలో వున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల పాలకవర్గాలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదని తెలిసిందిగ

అన్ని కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం

నాగలక్ష్మి, సంపద కేంద్రాల జిల్లా సమన్వయ అధికారి

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను త్వరలోనే అందుబాటులోకి తేస్తాం. నిర్మాణ పనులు అర్థంతరంగా ఆగిపోయిన 135కిపైగా కేంద్రాల పనులను త్వరలోనే పూర్తిచేస్తాం. సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలదే. చెత్త నుంచి సంపద సృష్టి కోసం సర్పంచులు, పంచాయతీల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం.